క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే జంకె ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో జంకె దంపతులు

పెద్దదోర్నాల: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకట రెడ్డి దంపతులు సోమవారం మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలంలో దైవదర్శనం ముగించుకున్న ఆయన మార్కాపురం వెళ్తూ మార్గమధ్యంలోని పెద్దదోర్నాలలో ఆగారు. ఈ సందర్భంగా షిర్డీసాయి బాబా ఆలయ కమిటీ సభ్యులు జంకె దంపతులను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి

తాళ్లూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7వ తేదీన మంగళవారం విజయవాడలో తల పెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు గండూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నారిపెద్ది శ్రీనివాసరావు పిలుపు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు ఏడాదిన్నర దాటినా ఉపాధ్యాయులకు ఇచ్చిన 12వ పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి (ఐఆర్), నాలుగు పెండింగ్ డీఏలు ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్కీం సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు సంగు రవిచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిలర్ పోలంరెడ్డి సుబ్బారెడ్డి కోరారు.

12న రైతు సమస్యలపై జేవీవీ సదస్సు

గిద్దలూరు రూరల్: సాగునీరు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక విశ్వభారతి స్కూల్ ఆవరణలో ఈ నెల 12న జనవిజ్ఞాన వేదిక సదస్సు నిర్వహించనున్నట్లు జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగొండ పూర్తయ్యేనా తాగు, సాగు నీరు కష్టాలు తీరేనా, ఎన్నాళ్లీ వ్యవసాయం, నీరు కరువైంది, బతుకు బరువైంది, అన్నదాతకు ఆసరా ఏది అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాగునీటి సమస్యలపై మేధావి వర్గంతో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి పూర్వ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి, మాజీ శాసనసభ మండలి సభ్యుడు కె.ఎస్. లక్ష్మణరావులతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

గిద్దలూరు రూరల్: పంచాయతీల్లో స్థానిక సమస్యల పరిష్కారంపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ సీతారామారావు సూచించారు. మండలంలోని ముండ్లపాడు, కొమ్మునూరు గ్రామాల్లో సచివాలయాలను ఎంపీడీఓ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది సత్వరమే స్పందించాలని సూచించారు. సమయపాలన పాటిస్తు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడాలని స్పష్టం చేశారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురం నుంచి రాచర్ల మండలం సంగపేట వెళ్లే రోడ్డులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. జేబీకే పురం పోలేరమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ తీగలు సాగడంతో ఆర్టీసీ బస్ టాప్‌కు తగిలే ప్రమాదముందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు, వర్షం పడే సమయంలో విద్యుత్ తీగలు బస్ టాప్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదముందని, తీగలను సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మునగపాడులో మోస్తరు వర్షం


మునగపాడు చౌడమ్మ వాగులో ప్రవహిస్తున్న నీరు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసింది. మునగపాడులో కురిసిన వర్షానికి చౌడమ్మ వాగు పొంగడంతో రహదారి పక్కనున్న కాలనీలోని నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. గొట్లగట్టు ప్రాంతంలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో భారీ వర్షం పడుతుందని ఆశించిన ప్రజలు చిరుజల్లులతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. రబీ సీజన్ ప్రారంభం కావడంతో పలు గ్రామాల్లో వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

ఆ పశువైద్యశాల నిత్యం మూతే

- మూడు నెలల నుంచి తెరవని వైద్యశాల
- ఆందోళనలో పశుపోషకులు

దొనకొండ:

మండల కేంద్రం దొనకొండ ప్రభుత్వ పశువైద్యశాల మూడు నెలల నుంచి మూతేసే ఉంటోంది. వైద్యాధికారి లేక పోవడంతో తలుపులు తీసి వైద్యం చేసే వారే కరువయ్యారని ఆయా గ్రామాల్లోని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ పశు వైద్యాధికారిగా విధులు నిర్వహించిన కరిష్మా బదిలీపై మూడు నెలల క్రితం వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్యాధికారిని ప్రభుత్వం నియమించలేదు. మల్లంపేట వైద్యాధికారి అరుణ్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారనే సమాచారం ఉన్నా పశుపోషకులకు ఆయన వివరాలు తెలియడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆయన మూడు నెలల నుంచి వైద్యశాల వైపు కన్నెత్తి చూడలేదని పశుపోషకులు ఆరోపిస్తున్నారు. గ్రామాల నుంచి తమ గేదెలను వైద్యశాలకు తీసుకొచ్చి వైద్యాధికారి లేక పోవటంతో మళ్లీ ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇన్‌చార్జిలే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బదిలీపై వెళ్లిన ఉద్యోగి స్థానంలో వెంటనే భర్తీ ప్రక్రియ ప్రారంభించారు. గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి పశు వైద్యసిబ్బందిని నియమించారు. మండలంలో 18 పంచాయతీల్లో 30 రెవెన్యూ గ్రామాలున్నాయి. దొనకొండ, మల్లంపేటలో పశువైద్యశాలలు, ఆరవల్లిపాడులో సబ్ సెంటర్ నిర్మించారు. సచివాలయంలో పని చేసే వైద్య సిబ్బంది పశువులకు చిన్న వ్యాధులు, వైద్య పరీక్షలు చేసే వారు. పెద్ద వైద్యం, ఆపరేషన్లు చేయాల్సి వస్తే వైద్యాధికారి లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో నల్లజాతి గేదెలు 16,524, తెల్లజాతి గేదెలు 1,648, గొర్రెలు 9,879, మేకలు 3,762, కోళ్లు 16,665 ఉన్నట్లు పశు వైద్యశాల గణాంకాల ద్వారా తెలిసింది. ఈ విషయమై మల్లంపేట వైద్యాధికారి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా తాను దొనకొండ, కురిచేడు ఆస్పత్రులకు ఇన్‌చార్జిగా ఉన్నానని చెప్పారు. మల్లంపేట పశువైద్యశాలలోనే సమయం సరిపోతోందని పేర్కొన్నారు. దొనకొండ పశువైద్యశాలలో గోపాల మిత్రను నియమించి వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు వివరించారు.



దొనకొండలో తలుపులు తీయని పశువైద్యశాల

పశువైద్యాధికారిని నియమించాలి:



పశువైద్యశాలలో వైద్యాధికారి లేకపోవడంతో పశువులకు పెద్ద వ్యాధి వస్తే ఇబ్బందులు పడుతున్నాం. సచివాలయ సిబ్బంది చిన్న చిన్న వ్యాధులు చూసే వారే. మూడు నెలల నుంచి పశువైద్యశాల తలుపులు తీయడం లేదు. మేం పశువులు, మేకలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పశువులకు వ్యాధి వస్తే ఎవరు దిక్కు. వెంటనే ప్రభుత్వం దొనకొండకు పశువైద్యాధికారిని నియమించాలి.

– హనుమయ్య, గుట్టమీదపల్లి

మీ కోసం కార్యక్రమానికి అధికారుల డుమ్మా


మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎంపీడీఓ

పెద్దారవీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి మండ స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. రాష్ట్ర పభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు హాజరుకాక పోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక ప్రజలు అయోమయంలో ఉన్నారు. మండలం పరిధిలో మొత్తం 19 పంచాయతీలు ఉన్నాయి. మండల కేంద్రానికి ఏటు చూసిన దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో గ్రామాలు ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలు అర్జీ రూపంలో విన్నవించేందుకు మీ కోసం కార్యక్రమానికి వస్తుంటారు. మండల స్థాయి అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక తిరిగి గ్రామాలకు వెనుదిరిగి పోతున్నారు. మండల కేంద్రానికి వచ్చేందుకు రూ.100 నుంచి రూ.200 వరకు ఖర్చు అవుతుందని అర్జీదారులు వాపోతున్నారు. ఖర్చు అయిన పర్వాలేదని, సమస్య చెప్పుకుందామని మీకోసం కార్యక్రమానికి వస్తే సంబంధిత అధికారులు హాజరుకావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీఓ జాన్‌సుందరం, ఎంఆర్ఐ గోపి హాజరైనట్లు పుస్తకంలో సంతకాలు పెట్టారు. పలు శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే హాజరు కావడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్‌లు ఎవరి కార్యాలయాల్లో వారు కుర్చొని ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయం అటెండర్ ఎంపీడీఓ వద్దకు వచ్చి రిజిస్టర్ పుస్తకంలో సంతకం పెట్టించారు. మద్దలకట్ట పంచాయతీ చాట్లమడ గ్రామానికి చెందిన దుద్దెల వెంకట సుబ్బమ్మకు వితంతువు పింఛన్ మంజూరై నాలుగు నెలలు అవుతోంది. కానీ ఇంత వరకు సచివాలయం అధికారులు పింఛన్ డబ్బులు ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మీకోసం కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి వసతి కల్పించడం అభినందనీయం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డీఎం శంకర్

దర్శి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్టీసీ డీఎం శంకర్ అన్నారు. హబీబుల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 లీటర్ల కెపాసిటీ గల తాగునీటి ట్యాంక్‌ను సోమవారం శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పొదిలికి చెందిన హబీబుల్లా కరీముల్లాబేగ్, మీరా బేగ్‌లు వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం ప్రయాణికుల దాహార్తి తీర్చే విధంగా శుద్ధజలాన్ని అందించాలనే కృత నిశ్చయంతో దీన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ఆర్చరీ పోటీలకు దోర్నాల విద్యార్థి ఎంపిక


క్రీడాకారుడు నాగరాజుతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భూమని నాగరాజు జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్‌ప్రసన్నతాంజలి హర్షం వ్యక్తం చేశారు. గత నెల 15న ఒంగోలు ఏబీఎం క్రీడా ప్రాంగణంలో జరిగిన విలువిద్య పోటీల్లో నాగరాజు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో ఈ నెల 10,11,12వ తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటంపై వ్యాయామ ఉపాధ్యాయుడు రామానాయక్, ఉపాధ్యాయులు హెచ్.రామానాయక్, విజయమాణిక్యం, నాగమూర్తి, అనసూయ, రహమత్, శివ, అబ్దుల్ సలాం, పోలయ్య, మీటే నాయక్, మహబూబీ, మహాదేవి, అనిత, నాయబ్ రసూల్, నరేష్, కార్తీక్ అభినందనలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6 వేల కోట్లు


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

పొదిలి: రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు ఉంటే, రూ.400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవటం సిగ్గుచేటని, ఇంకా రూ.6 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ విమర్శించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. రామ్మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఒక వైపు పరీక్షల ఒత్తిడి, మరో వైపు ఫీజులు ఒత్తిడితో నలిగిపోతున్నారన్నారు. నిధులు విడుదల చేయకపోవటంతో కాలేజీ యాజమాన్యాలు అప్పుల్లో కూరుకుపోయి, సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేకపోతున్నామని బంద్‌కు పిలుపునిచ్చిన సంఘటనలు జరగటం దురదృష్టకరమన్నారు. నిధులు విడుదల చేయాలని రోడ్డెక్కిన విద్యార్థులను పోలీసులతో కొట్టించటం విద్యా రంగానికి మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. విద్యార్థులు అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యా రంగ సమస్యలు ఆలకించేందుకు విద్యాశాఖ మంత్రి ఒక్క నిముషం కూడా సమయం కేటాయించలేకపోతున్నారని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లకు మెస్ చార్జీలు పెంచకపోవటం, బకాయిలు సకాలంలో చెల్లించకపోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ జిల్లా యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ గురించి పట్టించుకోవటం లేదన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం అర్ధాంతరంగా ఆపేసి పీపీపీ పద్ధతుల్లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వ పీజీ కాలేజీల్లో ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు సీహెచ్.వినోద్, విజయ్, సాయి, గంగాజీ కుమార్, దేవ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి డిపోలో ప్రయాణికుల అవస్థలు


మార్కాపురం బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల తంటాలు

పొదిలి: పొదిలి ఆర్టీసీ డిపోలో మౌలిక వసతులు కొరవడటంపై ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆర్టీసీ డిపోల్లో వసతులు మెరుగుపరిచే దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవటంతతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. బస్సులు సరిపడినన్ని లేకపోవడం, వందలాది మంది ప్రయాణికులు కనీసం కూర్చునేందుకు కూడా అవకాశం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాన్లు సక్రమంగా పనిచేయకపోవడం, మంచినీరు అందుబాటులో లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో సోమవారం కాలేజీలు, పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రయాణికులు, అలాగే ఉద్యోగులు, వ్యాపారులు, బంధువుల వద్దకు, స్వగ్రామాలకు వెళ్లేవారితో బస్టాండ్ ఆవరణ కిక్కిరిసిపోయింది. బస్సులు పొదిలి డిపోలోకి చేరుకునేటప్పటికే ప్రయాణికులతో కిటకిటలాడుతుండటంతో అప్పటికే నిరీక్షిస్తున్న వారు విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అధికారులు స్పందించి అదనపు బస్సులు ఏర్పాటు చేయడంతోపాటు, బస్టాండ్‌లో అదనపు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రాణం పోసే బండి.. నిర్లక్ష్యం ఎందుకండి?



జీజీహెచ్‌లో చెట్టు కింద నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్ అధికారుల నిర్లక్ష్యానికి అంబులెన్స్ సాక్షిగా నిలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఆర్ ఇనీటీటివ్ పవర్‌గ్రిడ్ ఎస్ఆర్-1 ప్రతినిధులు సుమారు 40 లక్షల రూపాయల విలువచేసే ఆధునాతన అంబులెన్సును మూడేళ్ల క్రితం జీజీహెచ్‌కు అందించారు. కొద్దిరోజులు అంబులెన్స్‌ను వినియోగించిన ఆస్పత్రి అధికారులు అంతలోనే పక్కన పెట్టారు. కారణం తెలియదు కానీ అప్పటి నుంచి వినియోగిండం లేదు. జీజీహెచ్ ఆవరణలోని చెట్టు కింద పార్కింగ్ చేసిన అంబులెన్స్ క్రమంగా తుప్పుపడుతోంది. ప్రస్తుతం వైద్యశాలలో ఉన్న అంబులెన్స్‌లు బయటకు వెళ్లినప్పుడు రోగులు ప్రైవేట్ అంబులెన్స్‌లకు అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. కొద్దిపాటి మరమ్మతులతో అంబులెన్స్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

ఎమ్మెల్యే బూచేపల్లి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: అనారోగ్యంతో బాధపడుతున్న వెల్లంపల్లి నారాయణకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలో పోస్టాఫీస్ బజార్‌లో నివాసం ఉంటున్న నారాయణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డితో సాయం అందించారు. బూచేపల్లికి బాధితుడు నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడు అన్నవరపు రవి పాల్గొన్నారు.

ఈ మలుపు..ప్రమాదానికి పిలుపు!


ప్రమాదకరంగా ఉన్న మలుపు

దొనకొండ: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాల ఎదుట అర్ధ చంద్రాకారంగా ఉన్న తారు రోడ్డు మలుపు ప్రమాదానికి పిలుపుగా మారింది. ఈ రోడ్డు నుంచి నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. చాలా సార్లు ప్రమాదాలు జరిగాయి. సంవత్సరం క్రితం అయ్యప్ప మాల వేసుకున్న 10వ తరగతి విద్యార్థి ప్రమాదానికి గురై మృతి చెందాడు. అంతేకాకుండా వద్దిపాడు గ్రామానికి చెందిన ఒకరు, ఇండ్లచెరువు గ్రామానికి చెందిన మరొకరు, కొనకనమెట్ల గ్రామానికి చెందిన ఇంకొకరు ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడ్డారు. స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. నిత్యం కేజీబీవీ పాఠశాలకు విద్యార్థినుల కోసం తల్లిదండ్రులు వచ్చి వెళ్తుంటారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పీడు బ్రేకర్లు నిర్మించి ప్రమాదాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభుదాస్

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్ హాజరై మాట్లాడుతూ దేశంలో అంతకు ముందు ఉన్న అనేక పరోక్ష పన్నుల స్థానంలో కొత్తరకం పన్నును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. ఒకే దేశం ఒకే పన్ను విధానంతో దేశమంతా స్వేచ్ఛగా, వస్తు సేవలు పెరుగుతున్నాయన్నారు. పన్నుల విధానంలో, పారదర్శకత పన్నుల ఎగవేతను అరికట్టడం, లంచగొండితనం నివారణ అనే పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, సీహెచ్ ప్రవీణ, గంథం వేణు, ఏ.నగేష్, కె.రవీంద్ర, జి.రమేష్, ఎం.రామచంద్రయ్య, టి.వెంకటేశ్వర్లు, సారీలమ్మ, జి. రమేష్‌బాబు, వైవీ రమణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పుల్లలచెరువు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎల్.రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. చిత్తూరు జిల్లా దేవళంపాడులో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం ఎంతో బాధాకరమైన విషయమన్నారు. దేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ అంబేడ్కర్.. అని కొనియాడారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను శిక్షించకుంటే దళిత సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రాములు హెచ్చరించారు. వి.వెంకటేశ్వర్లు, గురువయ్య, మరియదాసు, నాగేషు పాల్గొన్నారు.

లాయర్ రాకేష్ కిషోర్ పట్టా రద్దు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న అంజయ్య, నాయకులు

తాళ్లూరు: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్పై బూటు విసిరేసి దాడి చేసేందుకు ప్రయత్నించిన లాయర్ రాకేష్ కిషోర్‌ను వెంటనే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి శాశ్వతంగా డీబార్ చేసి ఆయన న్యాయవాద పట్టాను రద్దు చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం తాళ్లూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానంలో చీఫ్ జస్టిస్ గవాయ్‌ను అవమానించిన లాయర్‌పై ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గౌరవ సభల్లో ఇలాంటివి తలెత్తడం సిగ్గుచేటని మండిపడ్డారు. దేశ ప్రధాని వెంటనే స్పందించి విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: విద్యుత్ సరఫరాకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏపీసీడీసీఎల్ ఏఈ సచ్చన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ లైన్ మెయింటెనెన్స్, చెట్లు, కొమ్మలు తొలగింపు కారణంగా 11 కేవీ లైన్ పరిధిలో ఉండే ఆటోనగర్, అద్దంకి రోడ్డు, గంగవరం రోడ్డు, సందువారిపాలెం, చింతలపాలెం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు అసౌకర్యానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.